క్లుప్తంగా

డాక్టర్ ఉమతో మంత్రి మనోహర్ భేటీ



తెనాలిఅర్బన్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం కొత్తపేటలోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమా నివాసానికి వెళ్లారు. డాక్టర్ ఉమా, డాక్టర్ లక్ష్మీప్రసాద్ దంపతులు ఆయనను సన్మానించి అభినందనలు తెలియజేశారు. అనంతరం వారితో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ కస్తూరి భాయ్, కొడాలి ఆదిలక్ష్మి, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, నేలటూరు బెన్ను, చంద్రమోహన్, యుగంధర్, సుభానీ, బసవేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి




తెనాలిఅర్బన్: వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చెరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రామలింగేశ్వరపేటలోని మమత నర్సింగ్ స్కూల్‌లో సోమవారం వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమకాటు వలన ఎక్కువగా వ్యాధులు సంభవిస్తాయని, దోమలు కుట్టకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలలో చూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, మమత స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ టి.రమేష్, ఉపాధ్యాయులు ఎం.సంధ్య, రాజ్యలక్ష్మి, నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల రాంప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమావేశాన్ని నిర్వహించాలి



తెనాలిరూరల్: తెనాలి డివిజనల్ విద్యుత్ అధికారి కార్యాలయంలో గతంలో మాదిరి విద్యుత్ వినియోగదారుల సమావేశాన్ని నిర్వహించాలని ది తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ సభ్యులు సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన సభ్యులు ఆయనకు ఈ అంశంపై వివరించారు. విద్యుత్ వినియోగదారుల సమావేశంలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను మినిట్స్ బుక్‌లో నమోదు చేసి కేవలం మూడు నుంచి ఐదు రోజుల్లోగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునే వారని, ఏడాదిగా సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం వ్యవసాయ సీజను ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లోని రైతుల విద్యుత్ సమస్యలను తెలియజేసుకునేందుకు వేదిక అవసరముందని, వినియోగదారుల సమావేశాన్ని నెలనెలా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్‌ను కలసిన వారిలో సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, రావూరి శివశంకరరావు, అబ్దుల్ ఆరీఫ్, వాకా పేరిరెడ్డి, సోమయ్య శాస్త్రి, కె.సత్యనారాయణ, పూలా సతీష్ ఉన్నారు.

పర్యావరణంపై అవగాహన ర్యాలీ



గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ–పచ్చదనం ప్రాధాన్యం చాటుతూ సోమవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల నుంచి ప్లకార్డులు చేత పట్టుకుని పెద్ద సంఖ్యలో విద్యార్థులు బృందావన్‌గార్డెన్స్, స్తంభాల గరువు వరకు ప్రదర్శన చేశారు. ప్రదర్శనను ప్రారంభించిన పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు నిర్వహించిన వన మహోత్సవంలో తమ పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాటు మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతను తెలియజేశారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వృక్షాలు లేని భూమికి జీవం ఉండదని, తద్వారా జీవకోటి మనుగడ సాధ్యపడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

విలువలు, విశ్వసనీయతకు ప్రతిరూపం డాక్టర్ వైఎస్సార్

- డాక్టర్ వైఎస్సార్ 75వ జయంతి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- వాడవాడలా రాజన్నకు జననివాళి



పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించిన మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత అనే పదాలకు నిజమైన అర్థం చెప్పిన మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని, పేదల కోసం ఆయన చూపిన బాటలోనే ఎన్నటికీ పేదల పక్షానే నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గపార్టీ ఇన్‌చార్జి అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతిని తెనాలి నియోజకవర్గంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రణరంగ చౌక్‌లోని డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఘనంగా పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, ప్రజలు కట్టబెట్టిన అధికారంతో విలువలతో, విశ్వసనీయతతో ఏరకంగా పని చేయాలనేది ఆచరణలో చేసి చూపించిన మహానుభావుడు డాక్టర్ వై.ఎస్. అన్నారు. పేదలు, మధ్యతరగతి వర్గాల ప్రజలకు డాక్టర్ వైఎస్సార్ పాలన గొప్ప వరమని గుర్తుచేశారు. ఆయన తదనంతరం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి కన్న కలలను సాకారం చేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం నుంచి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం జగన్‌మోహన్ రెడ్డి గొప్పగా పరిపాలన చేశారని సోదాహరణంగా చెప్పారు. ఆంధ్ర రాష్ట్రంలో వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమాన్ని, పేదవాడి జీవనం మెరుగుదలకు ఆయన ఆశయాల కోసం తామంతా పనిచేస్తామన్నారు. ఎన్నటికీ పేదల పక్షాల నిలుస్తామని స్పష్టంచేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ తన సంక్షేమ పరిపాలనతో డాక్టర్ వైఎస్సార్ పేదల మనసుల్లో దేవుడిలా గుడి కట్టుకున్నారని చెప్పారు. అదే బాటలో ఆయన తనయుడు జగన్ మోహన్ రెడ్డి సువర్ణ పాలన అందించి అంతకుమించిన స్థానం సంపాదించుకున్నట్టు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేద ప్రజలు దేవుడిలా భావించే వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయటం, ప్రభుత్వ ఆస్తులను కూలగొట్టటం దారుణమన్నారు. ఇకనైనా ఆ సంస్కృతిని విడనాడాలని విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ వైఎస్సార్ వ్యక్తిత్వం, అందించిన సంక్షేమ పాలనపై పార్టీ క్లస్టర్–1,2 అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, మన్నవ ప్రభాకర్, కఠారి హరీష్ మాట్లాడారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, తోట రఘురామ్, మొగల్ అహ్మద్, యాతాటి అనిల్, గొడవర్తి సాయిహరేరామ్, కో–ఆప్షన్ సభ్యులు బచ్చనబోయిన శ్రీనివాసరావు, పెచ్చింగ్ సుభాని, మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు వంపుగళ్ల కృష్ణ, పార్టీ నేతలు దేసు శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, పెదలంక వెంకటేశ్వరరావు, కాకి దేవ సహాయం, షేక్ మీరావలి, కుర్రా శ్రీను, కోలా వాసు, అత్తోట చంటి, గంపల శివనాగేశ్వరరావు, కావేటి నిర్మల, షేక్ ఫరీద్, ఎ.సిరికృష్ణ, బొమ్ము నాగిరెడ్డి, మంద్రు రాజు, గోరికపూడి బాలరాజు, న్యాయవాదులు కేఎం విల్సన్, గుంటూరు కృష్ణ, వేముల మహేష్, యలవర్తి సాంబశివరావు, రావి రాంబాబు, అక్కిదాసు కిరణ్, దుండి కొండారెడ్డి, దానబోయిన వెంకట నరసయ్య, జి.మోహనరావు, నాగసరపు కృష్ణ, ఎన్ఆర్‌కే శర్మ, బ్రదర్ ఆనందన్న పాల్గొన్నారు.

ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ వైఎస్సార్

తెనాలిఅర్బన్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొండవీటి సేవాసమితి గౌరవాధ్యక్షులు పేరం సంజీవరెడ్డి, అధ్యక్షులు వుయ్యూరు సంజీవరెడ్డిలు కొనియాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని రణరంగచౌక్‌లోని ఆయన కాంస్య విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి మెట్టు శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ కె.చెన్నారెడ్డి, సభ్యులు జి.శ్రీనివాసరెడ్డి, ఉడుముల చిన్న బాలకోటిరెడ్డి, వాకా పేరిరెడ్డి, భీమవరపు యారవరెడ్డి, నల్లపు బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

- డాక్టర్ వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని తెనాలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చందు సాంబశివుడు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొన్నూరు నాగసూర్యశశిధరరావు, మల్లవరపు విజయ్, పినపాటి స్టీవెన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

తెనాలి రూరల్‌లో....

తెనాలిరూరల్: మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. రూరల్ మండల గ్రామాల్లో రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పాలాభిషేకాలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కఠేవరం గ్రామంలో మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ మైలా భానుప్రసాద్, శివారెడ్డి, ఎల్‌బీసీ చిన్ని, షేక్ షఫీ, శ్రీనివాసరెడ్డి, సురేష్, ఇతర నాయకులు గ్రామంలోని రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లెపాడులో పినపాటి నిరంజన్, పినపాటి వందన్‌రాజు తదితరులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాల్గొన్నారు.



కఠెవరంలో రాజన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కొల్లిపరలో...

కొల్లిపర: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోమవారం 75వ జయంతి సందర్భంగా మండల పరిధిలోని అత్తోట, చివలూరు, తూములూరు, కొల్లిపర, మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కొల్లిపరలో తెనాలి నాయోజకవర్గం వైఎస్సార్‌సీపీ పార్టీ ఇన్‌చార్జి అన్నాబత్తుని శివకుమార్ ప్రధాన కూడలిలో ఉన్న రాజన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కొల్లిపరలో రాజన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న శివకుమార్



డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కొండవీటి సేవాసమితి నాయకులు

నేడు తెనాలిలో జగన్నాథ రథయాత్ర

తెనాలి: పట్టణంలో శ్రీజగన్నాథస్వామి రథయాత్ర మంగళవారం జరుగుతుందని ఇస్కాన్ టెంపుల్ తెనాలి ప్రతినిధి సింహగౌరదాస్ తెలియజేశారు. స్థానిక నాజరుపేటలోని ఇస్కాన్ టెంపుల్‌లో సహాయకులతో రథయాత్ర ఆహ్వానపత్రికను సోమవారం ఆవిష్కరించారు. వివరాలను వెల్లడించారు. జగన్నాథపురిలో జరుగుతున్న రథయాత్ర మన తెనాలి నగరంలోనూ ఏటా జరుగుతోందని గుర్తుచేశారు. ఆరోజున స్వామివారు వీధిలోకి వచ్చి మనందరి కోసం దర్శనం ఇవ్వబోతున్నారని చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు స్థానిక శివాజీచౌక్‌లో యాత్ర ప్రారంభమవుతుందని, అక్కడనుండి గాంధీ చౌక్ మీదుగా రజకచెరువు, గంగానమ్మపేట, మెయిన్ రోడ్ నుంచి గాంధీ చౌక్, బోస్ రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు కొనసాగుతుందని వివరించారు.

అనంతరం వాసవీ అమ్మవారి ఆలయంలో స్వామి సేవా కార్యక్రమాలు ఉంటాయన్నారు. శాస్త్ర ప్రకారం ఎవరైనా రథంపై ఊరేగుతున్న జగన్నాథ్ స్వామిని దర్శించుకుంటే వాళ్లకు మంచి జరుగుతుందన్నారు. యాత్ర ఆద్యంతం హరినామ సంకీర్తన, వీధుల్లో ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. భారతీయ భక్తులే కాకుండా విదేశాల నుంచి కూడా వచ్చి మన తెనాలి నగర వీధిలో హరినామ సంకీర్తన చేస్తారని తెలియజేశారు. జానపద డప్పు వాయిద్యాలతో చాలా ఆకర్షణీయంగా ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి స్వామి దివ్యదర్శనాన్ని పొంది, రథం లాగి, ప్రసాదం స్వీకరించాలని కోరారు.



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన సింహగౌరదాస్

మీ కోసంలో తొమ్మిది అర్జీలు

తెనాలిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీ కోసం' కార్యక్రమంలో తొమ్మిది అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీటిలో సర్వే కోసం రెండు, పట్టాదారు పాసు పుస్తకం కోసం ఒకటి, సుమోటో అంశాలు నాలుగు, గృహ నిర్మాణ, పంచాయతీ రాజ్ శాఖలకు సంబంధించి ఒక్కో అర్జీలు ఉన్నట్టు చెప్పారు. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

శారదామాత జీవితం ఒక అద్భుతం



నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ పాలకవర్గం అధ్యక్షులు మస్తానయ్య, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ తూనుగుంట్ల రాధాభాయి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బోధమయ ప్రాణ మాతాజీ మాట్లాడుతూ శారదాదేవి జీవితం ఒక అద్భుతం అని అన్నారు. సాహితీవేత్త డాక్టర్. వి.నాగరాజ్యలక్ష్మీ, పూల విజయలక్ష్మీ, పద్మలత పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు 11 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 11 మంది వివిధ అంశాలపై అర్జీలను సమర్పించారు. కార్యాలయ ఏవో జయజయరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వితంతు పింఛను కోరుతూ ఒకటి, విద్యుత్, పోలీస్, డీఎల్‌పీవో శాఖలకు సంబంధించి ఒక్కొటి చొప్పున, రెవెన్యూ విభాగంలో వివిధ అంశాలకు మూడు అర్జీలు వచ్చాయని తెలియజేశారు.

ప్లాస్టిక్ రహిత తెనాలిగా రూపొందాలి



రత్నప్రభాకర్‌ను సన్మానిస్తున్న మంత్రి మనోహర్

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ గ్రహిత తెనాలి రూపకల్పనలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యశాలలో రక్తనిల్వలు తక్కువగా ఉన్నాయని, క్లబ్ సహకారంతో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. అలాగే వైద్యశాల ఆవరణలో గ్రీనరీ, చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన పరికరాల ఏర్పాటులో క్లబ్ సహకారం కోరారు. క్లబ్ పీడీజీ అనే రత్నప్రభాకర్ మాట్లాడుతూ 20 మందికి తోబడులు పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఏజీ మలినేని పెరుమళ్ళు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో క్లబ్ ముందుంటుందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి డి.మురళీకృష్ణ, ట్రెజరర్ రమేష్ కుమార్ బస్సాలిలు, కార్యవర్గ సభ్యులతో రత్నప్రభాకర్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వారిని సన్మానించారు. అలాగే అతిథులను కూడా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఈదర పూర్ణచంద్, కన్నెగంటి మురళీకృష్ణ, గుప్తా వెంకటరత్నం, డాక్టర్ డి.రవీంద్రనాథ్, కె.ఉపేంద్ర, జీవి.నారాయణ, బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న గణేష్ యూత్

ప్రతిభావంతులైన ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్థికసాయం

బామ్మ మాటతో ఉపాధ్యాయులైన ముగ్గురు మనవరాళ్ల వితరణ

తెనాలి: పట్టణ నందులపేటకు చెందిన మామిడాల సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె మనవరాళ్లు మామిడాల వెంకటశివ నీలిమ, శివనివేదిత, శివనిషాంతిలు సోమవారం బ్రాహ్మణ సంఘ నాయకులు చేతులమీదుగా ఆర్థికంగా వెనుకబడిన ఇంజినీరింగ విద్యార్థులకు రూ.50 వేలు అందజేశారు. ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సాయం అందించారు. ఆర్థిక వెనుకబాటుతనంతో ఎవరూ చదువుకు దూరం కారాదనేది తమ బామ్మ ఆశయంలో భాగంగా తాము ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు సాయపడుతున్నట్టు శివనివేదిత తెలిపారు. సీతామహాలక్ష్మి చేసిన సూచన ప్రకారం ముగ్గురు మనవరాళ్లు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడినట్టు బ్రాహ్మణ సంఘ నాయకులు వెల్లడించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత లక్కరాజు లక్ష్మణరావు మాట్లాడుతూ శివనివేదిత సోదరుల వితరణను అభినందించారు. వీరి స్ఫూర్తితో లాప్‌టాప్‌లు ఇచ్చేందుకు కొడవటికంటి కుమార్ ముందుకొచ్చారు. బ్రాహ్మణ సంఘ నాయకులు, పోతావఝుల పురుషోత్తమ శర్మ, త్రిపురారిభట్ల దత్తాత్రేయ శాస్త్రి, పరాశరం వెంకట రాంగోపాల్, వడ్లమాని ఉమామహేశ్వరరావు, చెన్నాప్రగడ శ్రీనివాస్, దావులూరి శ్యాం, మామిడాల జ్ఞాన ప్రసూనాంబ, మహావాది సువర్ణ, పరాశరం లక్ష్మీ పద్మావతి, మాగంటి శాస్త్రి పాల్గొన్నారు.



విద్యార్థి తల్లికి ఆర్థికసాయం పంపిణీ

ఉపాధ్యాయ వృత్తిలోనే నిజమైన సంతృప్తి



అథహరున్నీసాతో పాటు ఆమె తల్లిని సత్కరిస్తున్న షేక్ ఎండీ ఖాసిం, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడం ద్వారా నిజమైన సంతృప్తి లభిస్తుందని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తూ గత నెలాఖరున ఉద్యోగ విరమణ పొందిన షేక్ అథహరున్నీసాను సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విశ్రాంత హెచ్ఎం బడుగు విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి గౌరవ ప్రదమైన స్థానముందని, ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశిస్తున్న వారు అంకితభావంతో పని చేయాలని అన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాబియా బస్రీ అధ్యక్షతన విశ్రాంత హెచ్ఎం అథహరున్నీసాను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ ఎంఈఓలు నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్ పాల్గొన్నారు.

కొలకలూరులో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తెనాలి: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా సోమవారం రూరల్ మండల గ్రామం కొలకలూరులో గల ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాష్ట్రంలో సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టి, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న డాక్టర్ ఎస్సార్ పరిపాలన దక్షతను, పేదల సంక్షేమంపై ఆయనకు గల నిబద్ధతను, చిత్తశుద్ధిని స్మరించుకున్నారు. ఆయన తనయుడైన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి సంక్షేమ పాలనను మరింత ముందుకు తీసుకెళ్లిన వైనాన్ని గుర్తుచేశారు. అనంతరం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని దాదాపు 400 మంది విద్యార్థులకు పెన్ను లు, నోటుపుస్తకాలను మాజీ ఎమ్మెల్యే శివకుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తెనాలి మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడు పినపాటి అనిల్‌కుమార్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రసాదం సురేష్, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు కోలాంటి దాసు, పార్టీ నాయకులు కోడూరి రమేష్, ఉన్నం లక్ష్మయ్య, సుద్దపల్లి కనకరాజు, కొలకలూరి చిన్నమోషే, మల్లవరపు బుల్లయ్య, అయ్యంకి కోటయ్య, సుద్దపల్లి దానియేలు, షేక్ బాజీ మేస్త్రీ, అమీర్‌బాషా, షేక్ నాగూర, తన్నీరు శ్రీనివాసరావు, తులాబందుల లక్ష్మీకోటేశ్వరరావు, షేక్ అస్గర్, తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో భాష్యం విద్యార్థి ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తా చాటుతున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో సోమవారం అంతర్జాతీయ స్థాయి ఒలంపియాడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థి తేజేష్‌ను అభినందించారు. 2023–24 విద్యాసంవత్సరంలో నిర్వహించిన ఎస్ఓఎఫ్ నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపిన భాష్యం విద్యార్థి తేజేష్ కాకర్ల 146వ ర్యాంకుతో పాటు జోనల్ స్థాయిలో రెండో స్థానంలో నిలిచి రజత పతకం, నగదు బహుమతి గెలుపొందినట్లు చెప్పారు. ఈసందర్భంగా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష పాల్గొన్నారు.